
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 21 । మార్చి । 2024



ఎటూ తెగని భూవివాదం

ఇల్లెందు మండలం మామిడిగుండాల సీలింగ్ భూముల వివాదంలో భూస్వాములు, గిరిజనుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. 8లో



విస్తరిస్తున్న వనాలు

జిల్లాలో అటవీ విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లా భౌగోళిక విస్తీర్ణంలో 4,10,141.67 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 21°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.25

సహర్ (శుక్రవారం ఉ॥) 4.50

న్యూస్‌రీల్

రమణీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాదాసీదాగా స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో సాదాసీదాగా సాగింది. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గత సమావేశంలో చర్చించిన కొన్ని అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. కొత్త అంశాలేవీ చర్చించలేదు. కాగా, అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో సమావేశాలకు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు.

నిరుపయోగ వస్తువులకు 26న వేలం

కొత్తగూడెంటౌన్: జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఈనెల 26న హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం వేయనున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఐరన్, స్క్రాప్, మిషన్, పాత టైపు మిషన్లు, ఇతర వస్తువులు ఉన్నాయని, వేలంలో పాల్గొనదల్చిన వారు ఒరిజినల్, జిరాక్స్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, అడ్మిన్ ఆర్ఐ రవిని సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల విధులపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల అధికారులకు ఐడీఓసీలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లను నిత్యం మానిటరింగ్ చేయడం, ఎన్నికల వ్యయం, ఇతర అంశాలను సునిశితంగా పరిశీలించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి ఎండీ అలీం తదితరులు పాల్గొన్నారు.

పాలేరు సంత @ రూ.37.60 లక్షలు

కూసుమంచి: మండలంలోని పాలేరులోని వార సంత వేలాన్ని అధికారులు బుధవారం ఖరారు చేశారు. ఇప్పటికే రెండు సార్లు వేలం నిర్వహించినా పాట దారులు ప్రభుత్వ మద్దతు ధరకు మించి పాడకపోవటంతో వాయిదా వేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.62.47లక్షలుగా నిర్ణయించగా, పాటదారులు రూ.37.60 లక్షలకు మించి పాడలేదు. పాటదారులు కుమ్మక్కై తక్కువకు పాడారనే ఆరోపణలు వచ్చాయి. అయితే, చేసేదేం లేక ఈనెల 14న నిర్వహించిన వేలంలో రూ.37.60 లక్షలకు పాడిన కొత్తూరుకు చెందిన బజ్జూరి ఉపేందర్‌రెడ్డికి సంత నిర్వహణ ఖరారు చేస్తూ అధికారులు బుధవారం నిర్ణయించారు.

ఊహల్లోనే కేబుల్!

భద్రాచలం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆలయంతో పాటు పట్టణంలో చేపట్టాల్సిన పనులపై మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇటు ప్రభుత్వం, అటు దేవాదాయశాఖ ప్రతిపాదనలు రూపొందించడంలో నిమగ్నమయ్యాయి. ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి తగ్గట్టుగా ఆలయం నుంచి గోదావరి తీరం వరకు సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాచలం అభివృద్ధికి కొత్త ప్రతిపాదనల తయారీ

- గతంలో డిజైన్లు ఇచ్చిన ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి
- ఆలయం, నది నడుమ ఐకానిక్ బ్రిడ్జికి ప్రతిపాదన
- లక్నవరం తరహాలో తీగల వంతెన నిర్మించాలని భక్తుల డిమాండ్



భద్రాద్రిలో నిర్మించాలని భక్తులు కోరుతున్న సస్పెన్షన్ బ్రిడ్జి నమూనా

అమలు కాని ఆనంద్‌సాయి సూచనలు

అప్పుడెప్పుడో పోకల దమ్మక్క భద్రగిరి కొండపై కొలువైన సీతారాములకు తాటాకు పందిళ్లతో నీడ కల్పించింది. ఆ తర్వాత భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించడమే కాక సీతమ్మకు చింతాకు పతకం చేయించారు. ఆ తర్వాత క్రమంలో వచ్చిన రాజులు, పాలకులు, ప్రభుత్వాలు ఇటు ఆలయ అభివృద్ధికి, అటు భద్రాచలంలో భక్తుల కోసం ఒక్కో సౌకర్యం కల్పించారు. ఇందులో చెప్పుకోదగ్గవిగా గోదావరి నదిపై వంతెన, మిథిలా స్టేడియం, కరకట్ట కనిపిస్తాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా భద్రాచలం ముఖచిత్రాన్ని మార్చదగిన అభివృద్ధి ఏమీ జరగలేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత భద్రాచలం అభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వం యాదగిరిగుట్ట ఆలయాన్ని డిజైన్ చేసిన ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో సంప్రదింపులు జరిపింది. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయ సంప్రదాయాలు, ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు సూచనలు చేశారు. అందులో ఆలయం నుంచి గోదావరి తీరం వరకు కొత్తగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని పేర్కొన్నారు. అయితే ఈ సూచనలు తర్వాత కాలంలో అమలుకు నోచుకోలేదు.

కొత్త శోభ కల్పించాలి..

భద్రాచలం వచ్చిన భక్తుల్లో చాలా మంది సీతారాముల దర్శనానికి ముందు పావన గోదావరిలో స్నానం ఆచరించడం, అక్కడ పూజాదికాలు నిర్వహించడం ఆనవాయితీగా భావిస్తారు. మరికొందరు దర్శనం అనంతరం గోదావరి తీరానికి వచ్చి నదిలో నీళ్లు తలపై చల్లుకుంటారు. ఈ క్రమంలో ఆలయం నుంచి కరకట్ట వరకు కాలిబాటన నడుచుకుంటూ వెళ్లేందుకు వీలుగా ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మిస్తే భద్రాచలం క్షేత్రానికి కొత్త శోభ వస్తుందని భక్తులు అంటున్నారు. భద్రాచలం అభివృద్ధి కోసం ప్రస్తుతం రూపొందిస్తున్న ప్రతిపాదనల్లో సస్పెన్షన్ బ్రిడ్జికి చోటు కల్పించాలనే డిమాండ్ నానాటికీ పెరుగుతోంది.

లక్నవరంలో ప్రత్యేక ఆకర్షణ

పదిహేనేళ్ల క్రితం అప్పటి వరంగల్ జిల్లాలో దట్టమైన అడవిలో కొండల మధ్యన ఉన్న లక్నవరం చెరువులో సస్పెన్షన్ బ్రిడ్జి (తీగల వంతెన) నిర్మించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం తర్వాత లక్నవరానికి పర్యాటకులు భారీగా పెరిగారు. ఈ రద్దీని తట్టుకునేందుకు వీలుగా రెండో వంతెన నిర్మించాల్సి వచ్చింది. అదేవిధంగా కాటేజీల సంఖ్య ఎనిమిది నుంచి 40కి పెరిగాయి. ఇప్పటికీ సెలవు రోజుల్లో వేలాది మంది పర్యాటకులు లక్నవరం వస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం తీగల వంతెనే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆ తర్వాత కాలంలో సిద్దిపేట వద్ద కోమటి చెరువు, ఖమ్మంలో లకారం చెరువుతో పాటు రాష్ట్రంలో అనేక చోట్ల తీగల వంతెనలు నిర్మించారు. హైదరాబాద్‌లో దుర్గం చెరువు, కరీంనగర్‌లో మానేరు నదిపై భారీ స్థాయిలో తీగల వంతెనలు నిర్మించేవరకు ఈ క్రేజ్ వచ్చింది. ఇదే తరహాలో టెంపుల్ టూరిజంలో భాగంగా భద్రాచలంలో ఆలయం నుంచి గోదావరి కరకట్ట వరకు సస్పెన్షన్ బ్రిడ్జి (తీగల వంతెన) నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కలెక్టర్ ప్రియాంక అల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఏయే ప్రాంతాల్లో ఎంతమేర నీటి లభ్యత ఉంటుంది, చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్ చేయాలని, ప్రైవేట్ బావులు, నీటి వనరులు లీజుకు తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా ప్రైవేట్ బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం యజమానులతో పాటు బోర్‌వెల్ ఆపరేటర్లపైనా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్తబోర్ల మంజూరులో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడి ఎదుర్కొన్న గ్రామాల్లో ఆ సమస్య పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. ట్యాంకుల పరిశుభ్రత బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని, 15 రోజులకు ఒకసారి శుభ్రపర్చాలని ఆదేశించారు. జిల్లాలో 350 ఇంకుడు గుంతలు మంజూరు చేసినా ఇంకా పూర్తి కాలేదని, అన్నీ పూర్తిచేసి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఇన్‌చార్జ్ డీపీఓ సుధీర్‌కుమార్, అన్ని మండలాల మిషన్ భగీరథ డీఈలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండురోజులుగా మెస్ బంద్



వైద్య కళాశాలలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

బయటి నుంచి ఆహారం తెచ్చుకుంటున్న మెడికోలు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు రాజస్తాన్, బిహార్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు కాలేజీలో ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో కేఎస్ఎం పెట్రోల్ బంక్ వెనుక మూడు భవనాలు అద్దెకు తీసుకుని అందులో ఉంచారు. కాగా, మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన మెస్‌లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. తమ ఇష్ట ప్రకారం మెనూ పాటిస్తామని చెప్పినా అందులో నాణ్యత ఉండడం లేదని, దీంతో అర్థాకలితో బాధ పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.

నెలరోజులుగా ఉత్తరాది విద్యార్థుల ఇక్కట్లు..

నార్త్ ఇండియా నుంచి వచ్చిన విద్యార్థులు కళాశాలలో ఆహారం సరిగా లేకపోవడంతో నెలరోజులుగా పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లోని హోటళ్లలో తింటూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు సైతం క్యాంటీన్‌లో ఆహారం తినడం లేదు. మెస్ నిర్వాహకులు గతంలో నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. అయినా ఆహార పదార్థాల్లో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడోరోజూ కొనసాగిన ధర్నా

వైద్య కళాశాలలో మూడో రోజు బుధవారం కూడా విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని, మెనూ ప్రకారం మెస్ తయారు చేయాలని, నిలిచిపోయిన కళాశాల భవనాలు నిర్మాణం పూర్తి చేయాలని ప్లకార్డులతో ఆందోళన చేశారు. కాగా, డీఎంఈ వాణి ఆదేశాల మేరకు ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి రాజేశ్వర రావు, మాజీ సూపరింటెండెంట్ కిరణ్, మరో ఇద్దరు సభ్యులు రెండో రోజు కూడా విచారణ చేశారు. కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ ఎస్.ప్రసూనరాణి, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి బుధవారం వైద్య కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు



జనుము పంటను పరిశీలిస్తున్న బాబూరావు

చర్ల: యాసంగిలో రైతులు తక్కువ పెట్టుబడితో ఆరుతడి పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు సూచించారు. మండలంలోని సత్యనారాయణపురం, ఆర్.కొత్తగూడెం గ్రామాల్లో సాగు చేసిన జనుము పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందేందుకు జనుము, మినుము, పెసర, కంది వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఎకరానికి రూ.1000 ఖర్చు చేస్తే జనుము పంట ద్వారా రూ.30 నుంచి 40 వేల వరకు లాభం వస్తుందని చెప్పారు. అనంతరం తిప్పాపురం రైతులు సాగు చేసిన వరి పంటను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఓ శివరాంప్రసాద్, ఏఈఓలు, రైతులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతీక్ జైన్, పోలీస్, రెవెన్యూ అధికారులు

మణుగూరు టౌన్: ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు వినియోగంపై బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శనగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటువేసి పోలింగ్ శాతం పెంచాలని, అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓటు హక్కు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో మార్పులుంటే చెప్పాలి..

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ప్రతీక్‌జైన్ అన్నారు. అఖిలపక్ష రాజకీయ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా బీఎల్‌ఓలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్ కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని, ఈ మేరకు పార్టీల నాయకులు వారికి సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు పోలీస్, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణ క్రతువులో పాల్గొన్న జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి వెంకటేష్ ఖని(వీకే–7) గుట్టపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు గిరిధర్, ఉదయకుమారాచార్యులు ఆధ్వర్యాన సాగిన కల్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణ పీటలపై వీకే–7షాఫ్ట్ గని మేనేజర్ అభిలాష్, జీఎం కార్యాలయ ఉద్యోగి నకిరకంటి శ్రీనివాసరావు దంపతులు కూర్చున్నారు. అలాగే, కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, జీఎంలు జక్కం రమేష్, కట్టా బసవయ్య, ఏజీఎంలు కోడూరు శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, ఏజెంట్లు రవీందర్, పాలడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు. వీకే–7 గుట్టపై ఏటా ఏరియా జీఎం ఆధ్వర్యాన కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.శాలేంరాజు మతం వేరైనా కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి వేడుక నిర్వహించే అదృష్టం తనకు దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. సింగరేణి సంస్థ సర్వమతాలకు నిలయంగా నిలుస్తుండగా, ఒకే కుటుంబంలా కల్యాణం నిర్వహించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

ఆధారాలు చూపాల్సిందే..

- ఎన్నికల కోడ్‌తో నగదు తరలింపుపై ఆంక్షలు
- ఎక్కడికక్కడ నిఘా బృందాల ఏర్పాటు
- సామాన్యులకు తప్పని ఇక్కట్లు
- అసెంబ్లీ ఎన్నికల వేళ రూ.3.29 కోట్లు స్వాధీనం



సుజాతనగర్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చుంచుపల్లి: లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో ఈనెల 16 నుంచి జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు, పోలీసు నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ అవసరాల నిమిత్తం రూ.50 వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకెళ్లే వారు పలు జాగ్రత్తలు పాటించాలని, లేదంటే న్యాయపరమైన చిక్కులు తప్పవని ఎన్నికల సంఘం(ఈసీ) సూచిస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇక్కట్లు..

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళి అడ్డంకులతో పలువురు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సామాన్య ప్రజలు తమ అవసరాలకు నగదు తీసుకెళ్తూ పోలీసులకు పట్టు బడ్డారు. దీనిపై ప్రజలకు అంతగా అవగాహన లేకపోవడంతో డబ్బు వెంట తీసుకెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇక జిల్లాలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల వేళ 165 కేసులు నమోదు చేసి రూ.3.29 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన దానిలో 160 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు చూపడంతో రూ.2.97 కోట్లు తిరిగి ఇచ్చేశారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం జిల్లా సరిహద్దులు, ఇతర కీలక ప్రాంతాల్లో మొత్తం 15 ఎస్ఎస్‌టీ, 16 ఎఫ్ఎస్‌టీ, 21 వీఎస్‌టీ, ఐదు వీవీటీ బృందాలు పోలింగ్ పూర్తయ్యే వరకు 24 గంటలూ పని చేశాయి.

నగదు తరలింపులో జాగ్రత్తలిలా..

- రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే రుజువు ఉండాలి. వ్యాపారులైతే సంబంధిత పత్రాలు, లావాదేవీల బిల్లులు చూపాలి. సాధారణ వ్యక్తులైతే ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది, ఎందుకు వినియోగిస్తున్నారో తెలిపేలా బ్యాంకు నుంచి డ్రా చేసిన పత్రాలు లేదా ఇతర ఆధారాలు చూపాలి.
- రూ.2 లక్షలకు మించి నగదు మార్పిడిని పోలీసులు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. ఆ నగదు ఎలా వచ్చింది, ఏం చేయనున్నారనే ఆధారాలు చూపకపోతే స్వాధీనం చేసుకుంటారు. పట్టుబడిన నగదు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకైతే జిల్లా ఎన్నికల అధికారి నియమించిన కమిటీకి చేరవేస్తారు.
- నగదుతో పట్టుబడిన యజమాని నలుగురు సభ్యుల జిల్లా కమిటీ ముందు హాజరై ఆధారాలతో ఇచ్చే వివరణకు సంతృప్తి చెందితే తిరిగి ఇచ్చేస్తారు. లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేయడం ద్వారా తదుపరి చర్యలకు ఆదేశిస్తారు.
- స్వాధీనం చేసుకున్న నగదు రూ.10 లక్షలు దాటితే ఆదాయపు పన్ను శాఖకు నివేదించనుండగా.. వివిధ కోణాల్లో పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటారు.
- బంగారం, వెండి కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టినవి విడిపించినా వాటికి సంబంధించిన రశీదులు వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- ఎవరైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి బిల్లు చెల్లించడానికి భారీ మొత్తంలో డబ్బు తీసుకెళ్లాల్సి వస్తే, ఆస్పత్రి రశీదులు ఉండాలి.
- బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులు, గిఫ్ట్ ఆర్టికల్స్, కుక్కర్లు, క్రికెట్ కిట్ల విలువ రూ.10 వేలు దాటితే వాటిని పోలీసులు జప్తు చేస్తారు. వ్యాపార అవసరాల కోసం తరలిస్తున్నట్లు నిరూపిస్తేనే తిరిగి అప్పగిస్తారు.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా తాము ఖర్చు చేసే ప్రచారానికి, ఇతర వస్తువులకు సంబంధించి విక్రయదారులకు రూ.10 వేలకు మించి నగదు చెల్లించకూడదు. అంతకంటే ఎక్కువతైై చెక్కులు లేదా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అభ్యర్థి, వారి ఏజెంట్ రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లకూడదు.

ఆధారాలు తప్పనిసరి

రూ.50 వేలకు మించి నగదు తరలించే క్రమంలో తనిఖీల్లో అధికారులకు పట్టుబడితే, ఈసీ నిబంధనల ప్రకారం ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేకుంటే ఆ నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తారు. నగదుతో పాటు బంగారం, వెండి వంటి ఆభరణాలు కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టినా, విడిపించినా సంబంధిత రశీదులు వెంట తీసుకెళ్లాలి. ఎవరైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అందుకు అవసరమైన నగదు తీసుకెళ్తున్నట్టయితే డాక్టర్లు ఇచ్చిన రశీదులు చూపించాలి. సరైన ఆధారాలు లేకుండా భారీగా నగదు, బంగారాన్ని తరలిస్తూ పట్టుబడితే ఐటీ, జీఎస్టీ, ఈడీ అధికారులకు సమాచారం అందించి కేసు నమోదు చేస్తారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు

ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్):	15
ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్):	16
వీఎస్‌టీ (వీడియో సర్వైలెన్స్ టీమ్స్):	18
ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్స్):	30

క్లుప్తంగా

పోషకాహార లోపాన్ని అధిగమించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న వాసన్ సంస్థ ఎస్‌పీఓ అనిల్

అశ్వారావుపేటరూరల్: పోషకాహార లోపాన్ని అధిగమించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేయడమే వాసన్ సంస్థ(వాటర్ షెడ్ సపోర్ట్ ఫర్ హెల్తీ కమ్యూనిటీస్) లక్ష్యమని ఎస్‌పీఓ ఉప్పలపాటి అనిల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వినాయకపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాందాస్, డాక్టర్ దీపక్ రెడ్డిలతో సమావేశమై మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంచడం, రసాయన రహిత ఆహార పంటలు, పెరటి తోటల పెంపకం, ఆకు కూరల సాగు, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పథకం కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, శిరీష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్

గుండాల: దాడి ఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రతీష్ తెలిపారు. ఆళ్లపల్లి మండలం రాయిపాడు గ్రామానికి చెందిన రవీందర్‌కు, రమేష్‌కు మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ నెల 14న అర్ధరాత్రి రవీందర్ గొడ్డలితో దాడి చేయగా రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రివార్డు పేరుతో నగదు స్వాహా

అశ్వారావుపేటరూరల్: ఎస్‌బీఐ రివార్డు పేరిట గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి నగదు కాజేసిన సంఘటనపై బుధవారం పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం... మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బోల్లేపల్లి విజయ సత్యరామరాజు వాట్సాప్ నంబర్‌కు ఈ నెల 13న ఎస్‌బీఐ రివార్డు పేరుతో ఓ లింకు వచ్చింది. ఈ లింకును అతను ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు మూడు విడతల్లో మొత్తం రూ.50 వేలను డ్రా చేశారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా చేసినట్లు విజయ సత్యరామరాజు నంబరుకు మెసేజ్ రాగా, ఎస్‌బీఐ బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వారు సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగదు డ్రా చేస్తున్నట్లు చెప్పారు. తక్షణమే బ్యాంకు ఖాతా, ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం సేవలను బ్లాక్ చేసినట్లు బాధితుడి తెలిపాడు. బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాట్సాప్ నంబర్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై గొడ్డలితో దాడి

ఇల్లెందురూరల్: గొడ్డలితో ఆటోడ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన బుధవార రాత్రి జరిగింది. వివరాలు ఇలా.. మండలంలోని జెండాలవాగు సమీపంలో బుధవారం రాత్రి వెంకటేష్ అనే ఆటో డ్రైవర్ ఓ దుకాణం వద్ద ఆటో ఆపి పెట్రోల్ కావాలని అడిగాడు. దీంతో దుకాణానికి చెందిన సాయి అనే యువకుడు ఈ సమయంలో ఎందుకు వచ్చావ్ అని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొని ఘర్షణ జరిగింది. సాయి గొడ్డలితో దాడి చేయగా ఆటోడ్రైవర్ వెంకటేష్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వేటగాళ్ల ఉచ్చులకు కొండగొర్రె బలి



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కారేపల్లి: వేటగాళ్ల ఉచ్చులకు ఓ కొండగొర్రె బలైంది.కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి రేలకాయలపల్లి అటవీప్రాంతంలోని లక్ష్మీపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సిద్ధార్థరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చీమలపాడు ఫారెస్టు సెక్షన్‌లో కొందరు మంగళవారం రాత్రి విద్యుత్ తీగలు అమర్చగా, కొండగొర్రె తాకి మృత్యువాత పడింది. అనంతరం వేటగాళ్లు లక్ష్మీపురంలో బుధవారం కొండగొర్రెను కోసి మాంసం పోగులు వేసుకోవడంతో పాటు మిగతాది అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో అటవీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు కేజీల కొండగొర్రె మాంసమే కాక వండిన కూర స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదుచేశారు. వీరిలో ముగ్గురు పరారు కాగా నిందితుల్లో ఒకరైన పడిగె అంజిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

విస్తరిస్తున్న వనాలు

- జిల్లాలో 11 కోట్ల మొక్కలు నాటిన అధికారులు
- క్రమంగా తగ్గుతున్న అడవుల నరికివేత
- పెరిగిన అడవితో పరుచుకుంటున్న పచ్చదనం

నేడు ప్రపంచ అటవీ దినోత్సవం



అభయారణ్యంలో పెరిగిన అడవి

పాల్వంచరూరల్: జిల్లాలో ఏటేటా అటవీ విస్తీర్ణం పెరుగుతోంది. గతంలో చెట్ల నరికివేత, పోడు సాగు వంటి కారణాలతో పలచబడిపోయింది. రాష్ట్రంలో ఉన్న అడవుల విస్తీర్ణాన్ని 25 నుంచి 33 శాతానికి పెంచాలనే లక్ష్యంలో గత రాష్ట్ర ప్రభుత్వం 2015 ఉంచి హరితహారం కార్యక్రమం చేపట్టింది. విస్తృతంగా మొక్కలు నాటడంతో అటవీ విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 7,08,989 హెక్టార్లు కాగా, అందులో అటవీ విస్తీర్ణం 4,10,141.67 హెక్టార్లుగా, 57.85 శాతంగా ఉంది.

తొమ్మిదేళ్లలో నాటిన మొక్కలు..

జిల్లాలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో 2023–24 వరకు 11.61 కోట్ల మొక్కలు నాటారు. 2015–2016లో 20.93 లక్షల మొక్కలు, 2016–2017లో 20.64లక్షలు 2017–2018లో 41. 63 లక్షలు, 2018–2019లో 29.47 లక్షలు, 2019–2020లో 32.06 లక్షలు, 2020–2021లో 32.84 లక్షలు, 2021–2022లో 49.88 లక్షల మొక్కలను నాటారు. 2022–2023లో 114.63 లక్షలు, 2023–2024లో 67.52 లక్షల మొక్కలను నాటారు. కాగా రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి జిల్లాలో 10,13,460 ఎకరాల అటవీ భూమి ఉంది. జిల్లాలో పోడు సాగు 2,29,229 ఎకరాలుకాగా ఇందులో 1,93,409 ఎకరాలకు ఆర్‌ఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారు.

చెట్లతో ఎంత ఉపయోగమంటే..

ఒక్క చెట్టు ఒక కిలో కలప తయారు చేసేందుకు 1.47 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ పీల్చుకుని, 1.07 కిలోల ఆక్సిజన్‌ను అందిస్తుంది. ఒక ఎకరంలోని చెట్ల నుంచి 18 మందికి జీవితాంతం సరిపడ ప్రాణవాయువు ల భిస్తుంది. 4,000 పౌండ్ల కలప తయారవుతుంది. ఒక మోటారు వాహనం 10,000 మైళ్ల దూరం ప్రయాణిస్తే వచ్చే కాలుష్యాన్ని 15 చెట్లు పూర్తిగా పీల్చేసుకుంటాయి. చెట్లు 10 శాతం వర్షపు నీటిని వేర్ల ద్వారా పైకి తెచ్చి వాతావరణంలోకి పంపిస్తాయి. మనిషి ఆరోగ్యానికి 40 శాతం వరకు వాడే మందులు అడవుల్లో చెట్ల ద్వారానే లభిస్తాయి. అడవులు అంతరించిపోతే గంటకు ఆరు రకాల జీవులు అంతరించి పోతాయి. ఒక టన్ను కాగితాన్ని రీ సైక్లింగ్ చేసి వాడుకుంటే 3.3 చదరపు మీటర్ల విస్తీర్ణం అడవులను కాపాడుకున్నట్లేనని నిపుణులు సూచిస్తున్నారు.

అటవీ సంరక్షణకు కృషి..



జిల్లాలో ఇప్పటివరకు 11.61 కోట్ల మొక్కలను నాటాం. తక్కువ అడవి ఉన్న, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నాం. ప్లాంటేషన్లు పెంచుతున్నాం. ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా గుర్తించి అడవులను సంరక్షించాలి. చెట్ల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఉంటుంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. బీట్ల వారీగా నిఘా పెంచి అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నాం.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

పెరిగిన చైతన్యం

గత ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో నాటిన ప్లాంటేషన్ మొక్కలు నేడు ఏపు పెరిగి అడవి దట్టంగా విస్తరించింది. గతంలో అడవిలో చెట్లను స్మగ్లర్లు ఒక వైపు, మరోవైపు పోడు సాగు పేరుతో సాగుదారులు నరికివేసేవారు. కాలక్రమంలో కలప వినియోగం తగ్గడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా నాటాలనే భావన ప్రజల్లో పెరిగింది. దీంతో అడవులను నరికివేయకుండా చెట్లను పెంచుతున్నారు. దీంతో అటవీ విస్తీర్ణం పెరుగుతోంది.

ఎటూ తెగని భూవివాదం

- 15 ఏళ్లుగా నలుగుతున్న 'మామిడిగుండాల' సమస్య
- భూస్వాములు, గిరిజనులకు మధ్య కుదరని ఏకాభిప్రాయం
- సీలింగ్ భూమిలో సర్వే చేయకుండానే వెనుదిరిగిన అధికారులు



భూస్వాములు, గిరిజనులతో చర్చిస్తున్న తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందురూరల్: మామిడిగుండాల సీలింగ్ భూముల సరిహద్దు వివాదం మూడు దశాబ్దాలుగా ఎటూ తెగడంలేదు. భూస్వాములు, గిరిజనుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో బుధవారం సర్వేకు వచ్చిన అధికారులు, సర్వే చేపట్టకుండానే వెనుదిరిగారు. మండలంలోని మామిడిగుండాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 130 పరిధిలో 4,209 ఎకరాల భూమి ఉంది. అందులో భూగరిష్ట పరిమితి చట్టానికి లోబడి సీలింగ్ భూమి 2,800 ఎకరాలను సుమారుగా నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం స్థానిక గిరిజనులకు, మిగులు భూమిని భూస్వాములకు అప్పగించింది. కానీ నాడు ఆ ప్రాంతం మొత్తం అడవిని తలపించేలా ఉండగా, సరిహద్దులు నిర్దేశించలేదు. అనంతరం గిరిజనులు భూమి సాగు చేసుకుంటుండగా, హద్దుల విషయంలో 15 ఏళ్లుగా వివాదం నెలకొంది. మూడేళ్ల క్రితం మధ్యేమార్గంగా అప్పటి అదనపు కలెక్టర్ చొరవతో ఇరువర్గాల అంగీకారంతో ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టారు. సర్వే తుది దశకు చేరుకున్న సమయంలో పోలీసు కేసు నమోదు కావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. తాజాగా హైకోర్టు ఆదేశాలతో మరోసారి ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలని ఉన్నతాధికారులు సూచించడంతో తహసీల్దార్ రవికుమార్, సర్వే అధికారులు, భూస్వాములు, గిరిజనులు సీలింగ్ భూములపై మరోసారి చర్చలు జరిపారు. ఎంజాయ్‌మెంట్ సర్వేకు ముందు తమకు సంబంధించిన 1200 ఎకరాలు వదిలేసి మిగతా భూమిలో రైతులకు 2,800 ఎకరాల విస్తీర్ణంలో హద్దులు చూపాలని భూస్వాములు కోరుతున్నారు. అయితే భూస్వాములు తమదిగా సూచించిన భూమిలో ప్రస్తుతం గిరిజనులు సాగులో ఉండటం, ఆ భూమిని వదులుకునేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో చేసేదిలేక రెవెన్యూ, సర్వే అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా సర్వే నంబర్ 130లో అటవీశాఖకు సంబంధించి 1,500 ఎకరాలు ఉందని పేర్కొంటూ అటవీశాఖ బీట్ అధికారి కల్యాణ్ సర్వే పట్ల అభ్యంతరం తెలిపారు.

శవపరీక్షకు లంచంపై ఆరా!

విచారణ చేపట్టిన ఎస్‌బీ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: జ్వరంతో చనిపోయిన వ్యక్తి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించేందుకు అశ్వారావుపేట సీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ లంచం అడిగారంటూ బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్‌బీ పోలీసులు అశ్వారావుపేట సీహెచ్‌సీ వద్ద విచారణ నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడు విజయ్‌కుమార్‌ను, బాధితులను పోలీసులు విడివిడిగా, ఎదురెదురుగా విచారించినట్లు సమాచారం . ఏసీబీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన రామన్నగూడెం గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరరావును ఫోన్ ద్వారా విచారించి వివరాలు సేకరించినట్లు సమాచారం. కాగా తాను రూ.40వేలు అడగలేదని, సిబ్బంది ఖర్చుల నిమిత్తం రూ. 4వేలు అడిగానని వైద్యుడి చెప్పినట్లు సమాచారం. కాగా మృతుడికి ఓ ప్రైవేటు బ్యాంకులో రుణం ఉంది. రుణగ్రస్తుడి పేరున ఆ బ్యాంకులో రూ.2 లక్షలకు ఇన్సూరెన్స్ ఉంది. సాధారణ మరణానికి బీమా సొమ్ము రావాలంటే వైద్యుడి సర్టిఫికెట్ ఉండాలని, అది లేకుంటే మీకు బీమా సొమ్ము రాదని.. సాధారణ మరణంగా సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ.40 వేలు డిమాండ్ చేశారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా పోస్టుమార్టం చేస్తామని చెప్పి, పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని బంధువులకు ఎలా అప్పగించారు? పోస్టుమార్టం చేస్తామని చెప్పిన సమయంలో మార్చురీలో ఉండాల్సిన ఎంఎన్‌ఓ సాంబ ఉన్నట్లుండి టీ నర్సాపురం వెళ్లానని ఎందుకు చెబుతున్నాడు.? ఏసీబీ అధికారులు వలపన్నారని ముందస్తు సమాచారం వైద్య సిబ్బందికి ఎలా తెలిసింది? అనేవి అంతుచిక్కని ప్రశ్నలుగా మారాయి.

ఈ వ్యవహారంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్‌ని వివరణ కోరగా.. తాను ఒక్క పైసా కూడా అడగలేదని తెలిపారు. పోస్టుమార్టం చేయాలని ఏఎస్ఐ అడగగా పోస్టుమార్టం ఇంక్వెస్ట్ రాసి ఇవ్వాలని కోరానని, ఎంత సేపటికీ ఇంక్వెస్ట్ రాకపోవడంతో పోస్టుమార్టం అవసరం లేదని లిఖిత పూర్వకంగా ఇస్తే మృతదేహాన్ని అప్పగించాలని సిబ్బందికి చెప్పి వెళ్లిపోయానని వివరించారు. తనపై వస్తున్న ఆరోపణలు పథకం ప్రకారం సృష్టిస్తున్నవేనని పేర్కొన్నారు.

ఆ ఇద్దరి చదువుల బాధ్యత నాదే...

కేజీబీవీ విద్యార్థినులను దత్తత తీసుకున్న ఎస్సై సూరి



చర్ల కేజీబీవీలో దత్తత తీసుకున్న విద్యార్థినులతో ఎస్సై సూరి

చర్ల రూరల్: తల్లిదండ్రులను కోల్పోయినా విద్యలో రాణిస్తున్న ఇద్దరు పేద విద్యార్థినులను దత్తత తీసుకుని, వారి చదువుల బాధ్యతను చర్ల ఎస్సై టీవీఆర్.సూరి స్వీకరించారు. చర్లలోని కస్తూర్బా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనిత, తల్లిని కోల్పోయిన శిరీష పరిస్థితి తెలుసుకుని చలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులిద్దరు ఎంత వరకు చదివినా తనదే బాధ్యత అని, ఏ ప్రాంతంలో ఉన్నా వారికి సహకరిస్తానని తెలిపారు. ఆడపిల్లలు క్రమశిక్షణతో విద్యలో రాణించి ప్రయోజకులై ఇంకొందరికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పినపాక మండలంలో ముగ్గురు విద్యార్థినులను దత్తత తీసుకుని చదివిస్తున్న ఎస్సై, ఇప్పుడు ఇంకో ఇద్దరి చదువు బాధ్యత స్వీకరించడంపై పలువురు అభినందించారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా

- 22 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

చర్ల: ట్రాక్టర్ బోల్తా పడి 22 మంది గాయపడ్డ సంఘటన బుధవారం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా చింతల్‌నార్ గ్రామానికి చెందిన సుమారు 45 మంది వ్యవసాయ కూలీలు నెల రోజుల క్రితం మిర్చికోత పనులకు వచ్చి తిరిగి వారి స్వగ్రామానికి ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో దోశిళ్లపల్లి శివారు మూలమలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడగా, 22 మంది కూలీలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చర్ల ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో పరిస్థితి విషమంగా ఉన్న మడకం మూయ, నూపా బీమె, పొడియం మాసా, మడకం ఊరెలను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మద్యం సీసాలు, బాక్సులు అప్పగించండి

టేకులపల్లి: టేకులపల్లిలో వైన్ షాపుల్లో మద్యం సీసాలు, బాక్సులు ఎత్తుకెళ్లిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. ఇప్పటికే కొందరు మద్యాన్ని తిరిగి అప్పగించారని, మిగిలిన వారు కూడా నిర్భయంగా పోలీసుస్టేషన్‌కు తెచ్చి ఇవ్వాలని, దర్యాప్తునకు సహకరించాలని కోరారు. సీసీ పుటేజీలు, ఫొటోలు, వీడియోల ఆధారంగా మద్యం తీసుకెళ్లిన వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. మద్యం సీసాలు తిరిగి ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్షేత్ర సందర్శనకు డిగ్రీ విద్యార్థులు



గుహల వద్ద డిగ్రీ విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ లైఫ్ సైన్సెస్ చివరి సంవత్సరం విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనకు వెళ్లారు. కళాశాలలోని బీఎస్సీ వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం విభాగాల ఆధ్వర్యాన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చొప్పల గ్రామం దేవర్ల గుట్టపై ఉన్న వృక్ష వైవిధ్యం, దామరవాయిలో ఉన్న మూడు వేల సంవత్సరాల క్రితం నాటి సమాధులు, రామప్ప సరస్సును సందర్శించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి సందర్శనకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్యాంప్రసాద్, డాక్టర్ నాగ సమీరా, డాక్టర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న జెన్‌కో క్రీడలు



లాన్‌టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

పాల్వంచ: పాల్వంచలోని విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో జరుగుతున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ వాలీబాల్, లాన్‌టెన్నిస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో కేటీపీఎస్ 7వ దశ జట్టు వైటీపీపీపై, కేటీపీఎస్ 5, 6వ దశల జట్టు పోచంపాడుపై, బీటీపీఎస్ జట్టు జూరాల టీంపై, కేటీపీఎస్ 7వ దశ జట్టు పోచంపాడుపై, కేటీపీపీ జట్టు వైటీపీఎస్ టీంపై విజయం సాధించాయి. అలాగే, లాన్ టెన్నిస్ టీం ఈవెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ, కేటీపీఎస్ 5, 6వ దశలు, కేటీపీపీ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఇక డబుల్స్‌లో కేటీపీపీ జట్టు బీటీపీఎస్‌పై, కేటీపీఎస్ 5, 6వ దశల జట్టు పోచంపాడుపై, కేటీపీపీ జట్టు జూరాలపై, వైటీపీఎస్ జట్టు పులిచింతలపై విజయం సాధించాయి. పోటీలకు కె.కాంతారావు, వీరూనాయక్, కె.రాంబాబు, వి.ప్రసాదరావు, బి.కబీర్, కె.ప్రకాశ్ రెఫరీలుగా వ్యవహరించగా, జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

- పదో తరగతి విద్యార్థిని గర్భం దాల్చడంతో కేసు

సుజాతనగర్: పదో తరగతి బాలికపై అదే తరగతికి చెందిన విద్యార్థి అత్యాచారానికి పాల్పడగా.. బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. సుజాతనగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17)పై అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈనెల 18న బాలిక పదో తరగతి పరీక్ష రాస్తూ కళ్లు తిరిగిపడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె గర్భం దాల్చిందని చెప్పగా తల్లిదండ్రులు మందలించడంతో బాలుడి విషయం చెప్పింది. ఈ ఘటనపై స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని పంచాయితీ నిర్వహించి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారనే సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు చేరుకుని బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా, బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, జేజే యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై జుబేదాబేగం తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీలోని భాస్కర్‌నగర్‌లో ఓ పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఓ వ్యక్తి పారిపోయాడు. ఐదు సెల్‌ఫోన్లు, రూ 9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందచేస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు బుధవారం విరాళం అందచేశారు. గుంటూరులోని వెంకటరమణ కాలనీకు చెందిన పి.నాగమారుతి కుమారి అలయ అధికారులకు రూ.1,11,911 విరాళం అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు లింగాల సాయిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాటేజీ శంకుస్థాపనలో పాల్గొన్న ఈఓ రమాదేవి, మాజీ ఈఓ రామకృష్ణంరాజు, తదితరులు

కాటేజీ నిర్మాణానికి శంకుస్థాపన

భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై నాగార్జున సిమెంట్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యాన కాటేజీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ కాటేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, మాజీ ఈఓ రామకృష్ణంరాజు, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు లొంగుబాటు

- అగ్రనేతల వద్ద పనిచేస్తూ విప్లవ సాహిత్యం ముద్రణ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్



మడవి బుద్రకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో కౌన్సెలింగ్ చేపట్టడంతో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు లొంగిపోయాడని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం... ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, టీఎస్ రాష్ట్ర మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు మడవి బుద్ర స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన బుద్ర అలియాస్ కృష్ణ 2010లో చర్ల–శబరి ఏరియా కమిటీలో చేరి 2015 వరకు దళ సభ్యుడిగా పని చేశాడు. 2015లో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోషన్ పొంది తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ ప్రెస్ టీం బాధ్యతలు నిర్వర్తించాడు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైన హరిభూషణ్, బండి ప్రకాష్, దామోదర్ వంటి అగ్రనాయకుల దగ్గర పనిచేస్తూ పార్టీ విప్లవ సాహిత్యం, కరపత్రాలను తయారుచేస్తుండేవాడు. బుద్రపై రూ.4 లక్షల రివార్డు ఉంది. అతనికి ఎస్పీ నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సమావేశంలో ఓఎస్డీ సాయిమనోహర్, 141 బెటాలియన్ కమాండెంట్ రేవతి అర్జునన్, దమ్ముగూడెం సీఐ అశోక్ పాల్గొన్నారు.